# మీరే చెప్పండి . . .

రామనాథం, రంగనాథం ఒక తల్లి పిల్లలే! అయినా ఒకే ఆకాశంలో ఉదయించే సూర్యచంద్రుల స్వభావ స్వరూపాలెలా వేరో, వీళ్ళే అలాగే!

రామనాథానికి సంపాదన చాలా కలిసొచ్చింది. మామూలు చదువే చదివినా, బిజినెస్‌లో న్యాయంగానే సంపాదించినా అదృష్టం కలిసి రావడంతో పట్టిందల్లా బంగారమయింది. రంగనాథం పెద్ద చదువులు చదివి యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. అన్నదమ్ము లిద్దరూ మాటకారులే! వృత్తిరీత్యా ప్రొఫెసర్ కావడంవల్ల, శిష్యకోటి చాలామందున్నారు రంగనాథానికి. నిజంగా వినయం వున్నా లేకపోయినా గురువుగారంటూ దండాలు పెట్టేవాళ్ళకి కొదవలేదు. అందుకేనేమో రామనాథం అలా దండాలు పెట్టించుకోవాలని, చేతికి ఎముకలేనివాడిలా, తనవైపు వాళ్ళకీ, తన భార్యవైపు వాళ్ళకీ సహాయం, ఏదడిగినా సరే చేస్తూ వచ్చాడు. నెలల తరబడి వాళ్ళని తన ఇంట్లో ఉంచుకుని తిండీ, తిప్పలూ, బట్టలూ వగైరా అన్నీ చేస్తూ వచ్చాడు. ప్రతివాడు తన దానధర్మాల గురించి, స్పందించే గుణం గురించి పొగుడుతూ వుంటే, పొగిడిన వాళ్ళందరికీ మరింత ఎక్కువ సహాయం చేస్తూ వచ్చాడు. అతని నైజాన్ని చక్కగా అంచనా వెయ్యగలిగిన వాళ్ళందరూ, హాయిగా సహాయాలు పొందుతూ, పొగడ్తల వర్షం కురిపిస్తూ ఉంటే, ఆ పొగడ్తలన్నీ సత్యాలేనని, పొగిడిన వాళ్ళందరూ, తనని ఎంతో ప్రేమిస్తున్నారనీ మురిసిపోతూ గర్వించేవారు రామనాథంగారు. తనకి లేకపోయినా, తన్నుమాలిన ధర్మంచేసి పొంగిపోయేవారు. ఈ బయటి వాళ్ళగోలతో తన భార్యా పిల్లలపట్ల తగినంత శ్రద్ధ చూపించలేకపోయారు. డబ్బు పడేస్తే పన్లన్నీ వాటంతటవే అయిపోతాయనే భ్రమలో బ్రతికారాయన. అందుకే నౌఖర్లూ, చాకర్లూ, డ్రైవర్లూ తను అనుభవించడానికీ తన కుటుంబ సభ్యులకే కాదు. తన ఇంటికొచ్చిన వాళ్ళందరికీ వాళ్ళచేతే పన్లు చేయించేవారు. ఆ ఇల్లు అయిదు నక్షత్రాల హోటలుకన్నా సుఖమనుకునే వాళ్ళు అందరూ, సోకాల్డ్ ఫ్రెండ్సూ... రాబందుల్లాంటి బంధువులూ...

*          *          *

రంగనాథం గారి సంపాదన రామనాథంగారి సంపాదనలో సగం కూడా లేదేమో! పెద్ద భవంతి కట్టాడు. కొలీగ్స్ దగ్గరనుంచి శిష్యబృందం వరకూ అందరితోటి తియ్యగా మాట్లాడి పంపేవారు కానీ, ఇంటికి ఎవరినీ రమ్మని పిలిచేవారు కాదు. పిలిచినా వరండాలో ఫేము కుర్చీలో తప్ప, డ్రాయింగ్ రూమ్ సోఫాలోకి కూడా ఎవ్వరినీ రమ్మని కూర్చోమనేవారు కాదు. అన్ని వస్తువులూ

బజార్లో షోకేసుల్లోలా మెరిసిపోతూ వుండేవి. పొరపాటున ఎవరైనా వాళ్ళింటికెళితే వాళ్ళ కళ్ళముందే పదిసార్లు ప్రతివస్తువూ దులపడం, గదంతా ఫినాయిల్‌తో తుడవడం చేసేవారు. ఎవరు ఏ ఫంక్షనుకి పిలిచినా ఇంటిల్లిపాదీ వెళ్ళి, జోకుల మీద జోకులు వేసి వాళ్ళని భట్రాజుల్లా పొగిడేసి వచ్చేవారు. కనీసం పదిరూపాయల గిఫ్ట్ అయినా చేతిలో పెట్టకుండా, వాళ్ళ కబుర్లు వింటూ వాళ్ళేమీ ఇవ్వకపోయినా చాటునేమనుకున్నా, ఎదురుగుండా మటకు నమస్కారాలతో ముంచెత్తేవారు.

'రంగనాథం గారి జోక్స్, జోక్స్... భలే చమత్కారంగా మాట్లాడతారు' అనేవారుకొందరు.

'బాగా చదువుకున్న మనిషి...జ్ఞాని' అని మరికొందరు 'మహాపొదుపరి'...

ఇలా అతని బిరుదులు! పొగడ్తలు!

*　　　*　　　*

సరిగ్గా పాతికేళ్ళు గడిచిపోయాయి. చేతికెముకలేనట్టు డబ్బులు 'పరోపకారార్థమిదం శరీరం' అని ఖర్చుపెట్టిన రామనాథం గారు పరమ పదించారు.

పొదుపరి, బాగా చదువుకున్న మనిషిఅని పేరుపొందిన రంగనాథంగారూ స్వర్గస్థులయ్యారు. అయితే రామనాథం గురించి, ఎంతో సహాయం పొందిన వారంతా ఇలా అన్నారు.

'పాపం! రామనాథం ఏమీ వెనకేసుకోలేకపోగా అప్పుల పాలయి పోయాడు.

ఆఁ... అంతేమరి. గొప్పలకోసం పోయి అడిగినవాళ్ళకీ అడగని వాళ్ళకీ దానాల పేరిట పొగిడించుకున్నాడు పిచ్చివాడు. అలా చేస్తే తనకి గొప్ప పేరొస్తొందని మురిసిపోయాడే తప్ప, తన ఇల్లు గుల్లవుతోందని గ్రహించలేకపోయాడు.

'ఒట్టి ఫూలిష్ ఫెలో!... ఈ పొగడ్తలిలా లేకున్నా లేకపోయినా జనం గుర్తుంచుకుంటా డనుకున్నాడు. కన్న పిల్లల్ని పట్టించుకున్నా లేకపోయినా లోకం తరతరాలుగా తనని గొప్ప అంటుందనుకున్నాడు.

'స్వార్థం'...

'తనకి పేరు రావాలన్న తపనే...'

*　　　*　　　*

రంగనాథం గురించి ఇలా అన్నారు.

'ఓయబ్బో! అతడు మహా పొదుపరి గనుకనే అంత పెద్ద భవంతి కట్టగలిగేడు. జాగ్రత్తగా వుండడంలో తప్పేముంది? లేనిపోని గొప్పలు దేనికి?'

అంతే ముందు చూపు... దూరదృష్టి. ఈ సమాజం సంగతి తెలిసినవాడు. ఎవరూ ఏ సంగతీ ఎక్కువ రోజులు, పట్టించుకోరు. అది తెలుసుకున్న జ్ఞాని!

'కప్పుకాఫీ ఇవ్వకపోయినా కడుపుబ్బ నవ్విస్తూ కబుర్లు చెప్పేవాడు. కాఫీదేముందండీ... ఏ హోటల్లోనైనా దొరుకుతుంది.

కానీ, అలా నవ్వించే వాళ్ళూ, కబుర్లు చెప్పేవాళ్ళూ దొరకరుగా?'

'గ్రేట్‌మాన్'

*    *    *

మరో అయిదేళ్ళ తరువాత. . . . . అంటే ఇప్పుడు.

'ఇదండీ కథ!... అయిపోయింది.

కానీ, ఈ రోజుల్లో అన్నకి తమ్ముడూ, తమ్ముడికి అన్నా సహాయం చేసుకోవడం లేదు - ప్రజావాక్కు 'పట్టెడన్నం పెట్టండి కడుపు మాడిపోతోంది అని అడిగినా, చదువుకుంటాను కాస్త ఫీజుకి సహాయం చెయ్యమనో, పుస్తకాలు కొని పెట్టమనో అడిగితే ఛీ కొడతారు. ఒక పెద్ద మనిషి సన్మాన సభలకి జ్ఞాపికలకి డబ్బులిస్తారు. ఫోటోలు పేపర్లలో పడితే చూచుకొని గొప్పగా ఫీలయిపోతారు.' జనం... ఏమిటో రామనాథంగారు పాపం ఏమాటకామాట. పేరుకోసమే అయినా, సహాయం చేసేవాడు. ఆయన దగ్గర సహాయం పొందినవాళ్ళందరూ ఇప్పుడు పెద్ద పెద్ద పదవుల్లో వున్నారు. రంగనాథం కూడబెట్టిన డబ్బులు, కొడుకు బడుద్ధాయిలూ, మనవలూ మనవరాళ్ళూ, చదువు సంధ్యలు లేక ఖర్చుపెడుతూ ఆ సరదాల నీడల్లో బతుకుతున్నారు!...

'ఆ!... అదీ ఒక గొప్పేనా?'...

'మీరేమైనా అనండి రామనాథం రామనాథమే... మళ్ళీ కొందరైనా రామనాథాలు పుడితే బాగుండు.

*    *    *

ఇదండీ సంగతీ.....

రామనాథాలు పుట్టాలా? రంగనాథాలు పుట్టాలా? లేదా పైసాకోసం పీకలు కోసుకుంటున్న మరోరకం సోమనాథాలు స్వామినాథాలు పుట్టాలా? మీరే చెప్పండి. . .

*    *    *